కన్నీటి వ్యథ

నీటి కష్టాలు.. కన్నీటి వ్యథలవుతున్నాయి. అపర భగీరథ ప్రయత్నంతో గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటి ముంగిలిలోకి నల్లాలో తాగునీరొచ్చింది. అనాదిగా పడుతున్న ఇబ్బందులకు ఒక్కసారిగా చెక్ పెట్టినట్టయ్యింది. జన జీవనం ఆ నీటితో సంబురాలు జరుపుకొని తడిసిముద్దయ్యింది. ప్రజలకు నీటి కొరత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పరిస్థితులు మారాయి. గత ఉమ్మడి పాలనలో నీటి కోసం పడ్డ ఇబ్బందులు ఒక్కసారిగా పునరావృతం అయ్యాయి. ప్రతి ఇంటి ఆడబిడ్డల కళ్లల్లో నీళ్లు తిరుగుతూ.. ఇంటింటికో వ్యథగా మారింది. ట్యాంకర్ల ద్వారా వచ్చే నీళ్లు ఏ మూలకు సరిపోక పోగా.. బిందెడు నీళ్లను నెత్తిన ఎత్తుకొని తరలించాల్సి వస్తుంది. ఆ 'అపర భగీరథుని' ప్రభుత్వానికి, నేటి పాలనా తీరుకు ఈ చిత్రం అద్దం పడుతున్నది. క'న్నీటి' వ్యథకు ఇదో నిదర్శనం. ఈ చిత్రం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అంగడి బజార్‌లో బుధవారం కన్పించింది. గతానికి, ప్రస్తుతానికి ఎంతో వ్యత్యాసం చూపుతోంది ఈ చిత్రం.

ట్రంక్ లైన్ పనులు పూర్తిచేయండి

మంత్రాల చెరువు దగ్గర ట్రంక్ లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 29 : ముంపు సమస్యను నివారించడానికి ఏర్పాటు చేసిన ట్రంక్‌లైన్ పనులు ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువు దగ్గర ట్రంక్‌లైన్ పనులను పరిశీలించారు. మురుగు నీటి సమస్యను పరిష్కరించక పోవడంపై మండిపడ్డారు. అధికారులు ఎందుకు కాంట్రాక్టర్లతో పనులు చేయించడంలేదని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారుల తీరుపై ఆమె మండిపడ్డారు. రోడ్లపై చెత్త, మురుగు నీరు దర్శనమిస్తున్నాయని కొంత మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, బాల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత తోడ్పాటు

ఒప్పందం అనంతరం రఘురామిరెడ్డి, బృందం, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 29: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జనటిక్ రిసోర్సెస్(ఎన్‌బీపీజీఆర్)తో ఒప్పందం సంస్థ అభివృద్ధికి ప్రత్యక్ష, పరోక్షంగా ఎంతో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డీఆర్ డా. రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం (ఎన్‌బీపీజీఆర్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశోధనా విద్య కార్యక్రమాలలో ప్లాంట్ జెనెటిక్ వనరుల వినియోగం, ప్రధాన లక్ష్యంగా అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. పరిశోధనా విద్యా కార్యక్రమాలలో ఇరు సంస్థలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధనలో ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి పరిశోధనలు చేయడానికి దోహదం చేయనుందని, సంస్థ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి ఇరువురు ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు డా. అనిత, డా. జమునా రాణి, ఎన్‌బీపీజీఆర్ సంస్థ శాస్త్రవేత్తలు డా. వి.సిలియా చలం, డా. అనితా కోడూర్ పాల్గొని ఈ ఒప్పందం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట, మే 29 : యోనెక్స్ సన్‌రైజ్ రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 30 నుంచి జూన్ 2 వరకు న్యూ నాగోల్ సౌభాగ్యనగర్‌లోని ఆర్3 బ్యాడ్మింటన్ ఎక్సలెన్సియా (గ్రీన్ అండ్ రెడ్)లో జరుగనున్నాయని రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ (సాట్స్) సమన్వయంతో రంగారెడ్డి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్ అండర్-13, అండర్-15 విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, జూనియర్స్ అండర్-17, అండర్-19 విభాగాల్లో బాల, బాలికల సింగిల్స్, డబుల్స్, మెన్ అండ్ ఉమెన్ విభాగంలో (35 నుంచి 80 ఏళ్ల వరకు వయస్సుగల వారు)సింగిల్స్, డబుల్స్, వెటరన్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో సింగిల్స్ అండ్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. గొలుపొందిన విజేతలకు జూన్ 2న బహుమతులను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి అరుణ కుమారి

నాంపల్లి కోర్టులు, మే 29(నమస్తే తెలంగాణ): ఎలాంటి ఘటనలనైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి, నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణ కుమారి తెలిపారు. కాచిగూడలోని నింబోలి అడ్డలో ఉన్న బాలికల పరిశీలన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో చట్టాలపై ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలని, చదువులో రాణించి సమాజానికి ఉత్తమ సేవ లందించాలన్నారు. చట్టాల గురించి ఆమె వివరించారు. బాలికలపై సమాజంలో జరుగుతున్న ఘటనల పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని, ఇతర వ్యక్తులను నమ్మకూడదన్నారు. మోసాలకు గురిచేసే వారిని పసిగట్టి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి సమస్యల గురించి న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని, పరిష్కారానికి సంస్థ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ సభ్యులు, డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ చాలెంజ్-2024లో..

మహింద్రా యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ది బాబ్సన్ కోలాబరేటివ్ గ్లోబల్ స్టూడెంట్ చాలెంజ్-2024లో పాల్గొని ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులు

దుండిగల్, మే 29 : వినూత్న వ్యాపార భావనలే లక్ష్యంగా అమెరికాలోని మసాచుసెట్స్‌కు చెందిన బాబ్సన్ కాలేజ్ నిర్వహించిన వార్షిక పోటీలలో నగర శివారు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులు అదుర్స్ అనిపించారు. ఈ పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు యూనివర్సిటీ యాజమాన్యం పేర్కొంది. ది బాబ్సన్ కోలాబరేటివ్ గ్లోబల్ స్టూడెంట్ చాలెంజ్-2024లో మొత్తం ప్రపంచ వ్యాప్తంగా 20 దేశాలలోని 25 పాఠశాలల నుంచి 2,414 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి మాట్లాడుతూ ఈ అవార్డులు తమ విద్యార్థుల ప్రతిభ, అంకిత భావం, వినూత్న ఆలోచనలకు నిదర్శనమన్నారు. మహీంద్రా విశ్వవిద్యాలయంలో సృజనాత్మకత, సమస్య పరిష్కారాన్ని ప్రోత్సహించే వ్యవస్థాపక వాతావరణాన్ని పెంపొందించడానికి అంకితభావంతో ఉన్నామన్నారు. అనంతరం మహీంద్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ (సీఈఐ) ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ రాజ్‌కుమార్ ఫటాటే మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని తమ యూనివర్సిటీ విద్యార్థులు కలిగి ఉన్నారని తెలిపారు.

హార్వెస్టెడ్ రోబోటిక్స్ :-

హార్వెస్టెడ్ రోబోటిక్స్ అనేది అధునాతన లేజర్‌లు, రోబోటిక్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా రైతులకు రసాయన రహిత కలుపు నిర్వహణ పరిష్కారాన్ని అందించి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. యూనివర్సిటీకి చెందిన రాహుల్ ఆరెపాక, ప్రణవ్ మొగ్లీ, సాయిఫణి, సంజయ్ ప్రమోద్, అతిన్ సకీర్‌ల బృందం రెండో స్థానాన్ని సంపాదించింది.

ఎక్స్‌ట్రీమ్ ఇన్నోవేషన్స్ :-

ఎక్స్‌ట్రీమ్ ఇన్నోవేషన్స్ అనేది వర్కర్ సౌలభ్యం, ఉత్పాదకతను మెరుగుపరుస్తూ కార్యాలయంలో భద్రత, సామర్థ్యాన్ని పెంచేందుకు రూపొందించబడిన ఎర్గోనామిక్, ఖర్చుతో కూడుకున్న ఎక్సోస్కెలిటన్‌ను అభివృద్ధి చేసింది. ఇది వృత్తిపరమైన ఆరోగ్యం, ఎర్గోనామిక్స్‌లోని క్లిష్టమైన సమస్యలను పరిష్కరిస్తుంది. పారిశ్రామిక పని వాతావరణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యూనివర్సిటీకి చెందిన అభిషేక్ ప్రతాప్, రోనక్ ఓనం, ప్రేమ్ నింగోంబమ్, యశస్వి మాట్ల బృందం మూడో స్థానాన్ని సంపాదించింది.

బాల సాహిత్యంలో పిల్లలను ప్రోత్సహించాలి

- ఉత్తమ సమాజ నిర్మాణానికి బాల సాహిత్యం దోహదం
- పారంభమైన బాల సాహిత్య సమ్మేళనం

బాల సాహిత్యం సంపుటాలను ఆవిష్కరిస్తున్న వరప్రసాదరెడ్డి, రమణాచారి, శివారెడ్డి

తెలుగు యూనివర్సిటీ, మే 29: మాతృభాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, మానవీయ విలువల పట్ల పిల్లలను మళ్లించడానికి సాహిత్యం దోహదపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తులో రెండు రోజుల పాటు కొనసాగనున్న బాల సాహిత్య సమ్మేళనం బుధవారం ప్రారంభమైంది. ఈ సమ్మేళనాన్ని పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేవలం పాఠ్యాంశాల బోధనే కాకుండా బాల సాహిత్యం పట్ల మక్కువను పిల్లలో పెంచాలని వరప్రసాదరెడ్డి సూచించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ప్రసంగిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి బాల సాహిత్య వికాసం ఎంతో దోహదపడుతుందని వివరించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ రచనల పట్ల పిల్లల్లో అభిరుచిని పెంచేలా సారస్వత పరిషత్తు కథ, కవితలు వంటి అంశాలలో పోటీలు నిర్వహిస్తూ సాహిత్య వికాసానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య మాట్లాడుతూ, తల్లి కోడూరు శాంతమ్మ స్మారకార్థం బాల సాహిత్య సమ్మేళనాన్ని వరప్రసాదరెడ్డి నిర్వహిస్తూ బాల సాహితీవేత్తలు, రచయితలు, బాల సాహిత్య వికాసానికి కృషి చేస్తున్న సంస్థలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ సమన్వయకర్తగా వ్యవహరించిన సభలో బడిలో తెలుగు భాష, బాల సాహిత్యం - పత్రికలు, బాల సాహిత్య ప్రమాణాలు తదితర అంశాలపై చర్చాగోష్ఠులు, సదస్సులు జరిగాయి. బాలల కోసం పరిషత్తు ప్రచురించిన భాషా సాహిత్య వైభవం, ఆరోగ్యం - విజ్ఞానం ఐదు సంపుటాల పిల్లల కథలను ఈ సందర్భంగా వక్తలు ఆవిష్కరించారు. గురువారం కూడా ఈ సమ్మేళనం కొనసాగుతుందని జుర్రు చెన్నయ్య వెల్లడించారు.

సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ఆవిర్భావం

వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నరెడ్కో మాజీ చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి తదితరులు

బంజారాహిల్స్, మే 29: సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నరెడ్కో మాజీ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అసోసియేషన్ లోగోను, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. సైబరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంలో ఉన్న బిల్డర్ల సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా విధానాల రూపకల్పన సమయంలో సూచనలు అందించేందుకు తమ అసోసియేషన్ పని చేస్తుందని అధ్యక్షుడు ఉదయ్ శేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువను పెంచాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇప్పటికే 7.5 శాతం స్టాంప్ డ్యూటీ చెల్లిస్తుండగా, భూముల విలువ పెంపు రియల్ ఎస్టేట్ రంగంపై భారంగా మారుతుందని పలువురు బిల్డర్లు అభిప్రాయపడ్డారు. దీంతో పాటు నాలా కన్వర్షన్, నీటి పారుదల శాఖ క్లియరెన్స్ తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అరవింద్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే సంస్కృతం ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29: ప్రాథమిక విద్య స్థాయి నుంచే పాఠ్య ప్రణాళికలో సంస్కృతం ఉండాలని సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం అన్నారు. అకాడమీ తరపున రెండేళ్లుగా నడుపుతున్న 'సంస్కృతం ద్వారా ఆయుర్వేదం' అనే డిప్లమా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఆయుర్వేదంలో ప్రసిద్ధులైన డాక్టర్ సింహాద్రి, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ సురేఖ, డాక్టర్ రాజ్యలక్ష్మి అతిథులుగా పాల్గొని సంస్కృతానికి ఆయుర్వేదానికి భారతీయ సంప్రదాయానికి గల వైశిష్ట్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ సంస్కృతం విభాగం హెడ్ ప్రొఫెసర్ విద్యానంద ఆర్య, కోర్సు కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ జోషి పాల్గొన్నారు.

ఓయూలో.. ఆదమరిస్తే..!

వేలాది విద్యార్థులతో నిత్యం సందడిగా ఉండే ఉస్మానియా యూనివర్సిటీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. ఓయూ గ్రౌండ్ రోడ్డులో మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగకుండా విద్యార్థులు ఇలా ఎండిపోయిన చెట్టు కొమ్మను, బండరాళ్లను అడ్డుగా ఏర్పాటు చేశారు.

పులిపిల్ల కాదు.. అడవి పిల్లి!

దుండిగల్, మే 29: అడవి పిల్లిని చూసి చిరుత పులి పిల్లగా భావించిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన గాజులరామారం పరిధిలోని కైసర్‌నగర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో చోటు చేసుకుంది. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించిన నీటి సంపులో అడవి పిల్లి (జంగల్ క్యాట్) బుధవారం ఉదయం ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. అయితే, దానిని పులి పిల్లగా భావించి స్థానిక యువత అప్రమత్తమయ్యారు. వెంబడించి పట్టుకుని బంధించి, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

వైద్యుడిగా సేవలందిస్తూ.. ఎవరెస్టు అధిరోహణ

- ప్రపంచంలో మొట్టమొదటి వైద్య పర్వతారోహకుడిగా గుర్తింపు
- నగరంలోని ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు రాజశేఖర్ రెడ్డి ఘనత

మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించిన డాక్టర్ రాజశేఖరెడ్డి

మాదాపూర్, మే 29: అతనొక వైద్యుడు. అతను చేస్తున్న వృత్తితో సంతృప్తి పడలేదు. అలాగని అంతటి ఆగలేదు. లోపల తొలుస్తున్న కొరిక కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఏదో సాధించాలన్న తపన అతని మదిలో రగులుతూనే ఉంది. అయితే, అదేదో ఉత్తుత్త కోర్కె కాదు. పర్వతాలు, ఎవరెస్టులు ఎక్కాలన్నది అతని ఆశ. ఎవరెస్ట్ పర్వతాన్ని ఎక్కి రికార్డ్ సృష్టించాలన్నది అతని లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా అడుగులు వేసేందుకు భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో ట్రైనర్ శేఖర్ బాబు, రాకేష్‌ల వద్ద శిక్షణ తీసుకున్నాడు. అతను ఏడు సమ్మిట్స్‌ను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు ఐదు సమ్మిట్స్ (ఆఫ్రికా, ఆస్ట్రేలియా, యూరోప్, సౌత్ అమెరికా, ఆసియా)ను అధిరోహించాడు. చివరిసారిగా ఈ నెల 23న నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును పొందాడు. ఇంకా తన లక్ష్య సాధనలో మరో రెండు (అంటార్టికా, నార్త్ అమెరికా) మౌంటెయిన్స్ మిగిలి ఉండగా, వచ్చే ఏడాది వరకు వాటిని పూర్తి చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు. దేశంలోనే మూడో మౌంటెయినర్‌గా, ప్రపంచంలోనే మొట్టమొదటి వైద్యుడిగా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. మదీనాగూడలోని మైత్రినగర్‌లో ఉంటున్న డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఇది వరకు సన్‌షైన్ హాస్పిటల్, నీలిమా హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం కూకట్‌పల్లిలోని శ్రీ మంజు హాస్పిటల్స్‌లో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రాజశేఖర్‌రెడ్డికి భార్య ఓ కుమారుడు ఉన్నాడు. భార్య హరిప్రియ ఏఐజీ దవాఖానాలో వైద్యురాలిగా పనిచేస్తుండగా, కుమారుడు రియాన్స్‌రెడ్డి చదువుకుంటున్నాడు.

పోలీసు అభ్యర్థులు రోడ్డెక్కితే ప్రభుత్వానికే చెడ్డపేరు

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్, మే 29: పోలీసు అభ్యర్థులు రోడ్డెక్కి, శాంతి భద్రతల సమస్యలు ఏర్పడితే ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఎన్నో కష్ట నష్టాలను ఓర్చి శిక్షణ తీసుకొని పరీక్షలు రాసి కానిస్టేబుల్‌కు ఎంపికైతే వారిని ఏవో సాకులతో ట్రైనింగ్‌కు పంపకుంటే వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. సెలక్షన్ కాపీలు అందుకొని రెండు నెలలు గడిచినా స్క్రీనింగ్ కమిటీ పేరిట కాలయాపన చేయడం సరికాదన్నారు. తక్షణమే ఎంపికైన అభ్యర్థులను శిక్షణకు పంపాలని, బీసీ సంఘాలు వారికి మద్దతుగా నిలుస్తాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీలం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అన్వర్, మహిపాల్ యాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, తదితరులు

మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తదితరులు

బీసీలకు రిజర్వేషన్లు పెంచండి

- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

కాచిగూడ, మే 29: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, కులగణన చేపట్టిన తర్వాతేనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం వరకు పెంచాలని, రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్ గాంధీ వాగ్దానం చేశాడని సీఎం రేవంత్‌రెడ్డికి గుర్తుచేశారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సురేశ్, నందగోపాల్, పండరీనాథ్, ఉదయ్ నేత పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

సుల్తాన్‌బజార్, మే 29 : ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోఠిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి వాట్సప్ ద్వారా విన్నవించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్‌సీ, ఏరియర్స్ బకాయిలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.